సమాచారం

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా.19, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 45, పచ్చిమిర్చి 45, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 47, పచ్చకాకర 45, పందిరి బీర 50, క్యాబేజీ 11, క్యారెట్ 15, దొండ 40, గుండుబీన్స్ 85, గింజ చిక్కుడు 55, గోకరకాయ 45, కీర 15, దోసకాయ 35, బీట్‌రూట్ 15, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 18, చామగడ్డ 55, మొరంగడ్డ 17, కందగడ్డ 40, సొరకాయ 11, పొట్లకాయ 13, అరటికాయ 9, మునగకాయ 4-6, ముల్లంగి 3-5. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ద ఇంగ్లిష్ అండ్ ఫారెన్ లాంగ్వేజస్ సెంట్రల్ యూనివర్సిటీ(ఇఫ్లూ)లో ఖాళీగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ 14 బ్యాక్‌లాగ్, 44 జనరల్ పోస్టుల భర్తీకి ప్రకటన వెలువడింది. ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు అర్హత గల అభ్యర్థులు ఏప్రిల్ 14 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు వెల్లడించారు.

అమ్రేషన్ కృషి మరువలేనిది


సభలో మాట్లాడుతున్న నల్ల రాధాకృష్ణా

రసూల్‌పురా: పేదల అభ్యున్నతికి కంటోన్మెంట్ బోర్డు సభ్యులు దివంగత అమ్రేషన్ విశేషంగా కృషి చేశారని బహుజన సాహిత్య అకాడమీ, దళిత సంఘర్షణ సమితి జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ తెలిపారు. బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ డైరెక్టర్ వినీత ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన అమ్రేషన్ జయంతిలో రాధాకృష్ణా పాల్గొని మాట్లాడారు. అమ్రేషన్ స్ఫూర్తితో తమ బహుజన సాహిత్య అకాడమీ, దళిత సంఘర్షణ సమితి పేద ప్రజల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపడుతోందని అన్నారు. ముఖ్యంగా దళితుల అభ్యున్నతికి అనేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీకే. నితా గ్లోరి, జయశీలన్, వెంకటేష్, నరుదు కృష్ణ, ప్రభాకర్, నఫీజ్, చంద్రకళ పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీ గణేష్ ఆధ్వర్యంలో కార్ఖాన పీఎస్ సమీపంలో గురువారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత 12 ఏళ్లుగా నియోజకవర్గం వ్యాప్తంగా చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీరుస్తున్నట్లు శ్రీ గణేష్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భిక్షపతి, విష్ణు, షణ్ముగం, శరత్‌కుమార్, గౌతమ్‌కుమార్ పాల్గొన్నారు.

అన్నదాతా సుఖీభవ!

- మధ్యాహ్న మిత భోజనం మళ్లీ వచ్చేసింది
- నేటి నుంచి జూన్ 3 వరకు..


మిత భోజన కార్యక్రమంలో మంత్రి తలసాని(ఫైల్)

సనతనగర్: గత పుష్కర కాలంగా అన్నార్తులు, అభాగ్యుల ఆకలి తీరుస్తోన్న శ్రీనివాస సమాజ సేవా సమితి మరోసారి ఆ యజ్ఞానికి సిద్ధమైంది. శుక్రవారం నుంచే ఆ మహాక్రతువుకు సీనియర్ సిటిజన్స్ సిద్ధమయ్యారు. జూన్ 3వ తేదీ వరకు బీకేగూడ పార్కు వద్ద రోజుకు 250-300 మందికి మధ్యాహ్న మిత భోజనాన్ని వడ్డించి ఆకలి తీర్చనున్నారు.

దాతల సహకారంతో..

వేసవిలో శ్రీనివాస సమాజ సేవా సమితి చేపట్టే అన్నదాన కార్యక్రమంలో భాగస్వాములు అయ్యేందుకు దాతలు పోటీ పడుతుంటారు. ఒక్కోరోజు ఇద్దరు ముగ్గురు సైతం ముందుకు వచ్చి విందు భోజనాన్ని తలపించే రీతిలో రుచికరమైన వంటకాలను బాటసారులకు అందిస్తుంటారు. పుట్టిన, పెళ్లి రోజు వంటి శుభకార్యాలు, ఇలా ఏదో ఒక రూపంలో దాతలు స్వచ్ఛందంగా ముందుకువచ్చి మితభోజన యజ్ఞంలో భాగస్వామలవుతుంటారు. దాతలు అన్నదాన తేదీలను క్షణాల్లో బుకింగ్ చేసుకుంటారంటే అతిశయోక్తి కాదు. ఒక్కోదాత నుంచి రూ. 4,500ను స్వీకరించి రుచికరమైన వంటకాలను బాటసారులకు అందిస్తున్నారు. 10 కిలోల పెరుగన్నం, నిమ్మకాయ పచ్చడి, బగారా రైస్, కూర్మ, స్వీట్స్‌తో పాటు ప్లేట్లు, ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీలను కలుపుకుని 4,500గా నిర్ణయించారు. మధ్యాహ్న భోజన వితరణ కేంద్రం వద్ద అందరూ సీనియర్ సిటిజన్స్ సేవలు అందిస్తుండడం గమనార్హం.

నేడు మంత్రిచే ప్రారంభం..

శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చేతుల మీదుగా బీకేగూడ పార్కు వద్ద మధ్యాహ్న మిత భోజన కార్యక్రమం ప్రారంభించనున్నట్లు శ్రీనివాస సమాజ సేవా సమితి ట్రస్టీ పార్థసారథి తెలిపారు. ఈ కార్యక్రమానికి దాతల సహకారం అపూర్వమైందని ప్రతియేటా మితభోజన కేంద్ర నిర్వహణలో సీనియర్ సిటిజన్స్ సహకారం మరువలేనిదన్నారు.

ఠాణా.. ఏర్పాటయ్యేనా?

- ఉత్తర్వులు వచ్చి మూడు నెలలైనా స్పష్టత రాని వైనం
- పూర్తిస్థాయిలో లభించని భవనం
- వారాసీగూడ పీఎస్ ఏర్పాటుకు బాలారిష్టాలు


డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్‌తో సమావేశమైన అధికారులు

సికింద్రాబాద్ : వారాసీగూడ పేరుతో కొత్తగా ఏర్పాటు చేయనున్న పోలీస్‌స్టేషన్‌కు బాలారిష్టాలు చుట్టుముట్టాయి. వారాసీగూడ పోలీస్‌స్టేషన్‌తో పాటు, చిలకలగూడ ఏసీపీ కార్యాలయాన్ని బౌద్ధనగర్ కమ్యూనిటీహాల్లో ఏర్పాటు చేయాలని మూడు నెలల క్రితం ఉత్తర్వులు వెలువడినా పనులు ముందుకు సాగడం లేదు. బౌద్ధనగర్ కమ్యూనిటీహాల్లో పీఎస్, ఏసీపీ కార్యాలయ కార్యకలాపాలను కొనసాగించుకునేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినా పోలీసు కార్యాలయాల ఏర్పాటుకు అడ్డంకులు తప్పడం లేదు.

పోలీసు ప్రతిపాదన ఇదీ!

బౌద్ధనగర్ కమ్యూనిటీహాల్ భవనంలో గ్రౌండ్ ప్లస్ రెండు ఫ్లోర్లు ఉన్నాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో రిసెప్షన్ కౌంటర్, సందర్శకులు వేయిటింగ్ హాల్, మొదటి అంతస్తులో పోలీస్‌స్టేషన్, రెండవ అంతస్తులో అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయం ఏర్పాటు చేయాలని అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసుకున్నారు. తీరా కమ్యూనిటీహాల్ వద్దకు వెళ్తే పరిస్థితి మరోలా ఉంది. కమ్యూనిటీహాల్ గ్రౌండ్, మెదటి అంతస్తులు పరాధీనంలో ఉన్నాయి. కేవలం 3వ అంతస్తు మాత్రమే అందుబాటులో ఉంది. గ్రౌండ్ ఫ్లోర్‌లో బౌద్ధనగర్ కార్పొరేటర్ కార్యాలయం, మొదటి అంతస్తులో ఉమెన్ నైట్‌షెల్టర్ ఉంది.

నైట్ షెల్టర్ తీరు!

నామాలగుండులోని జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయంలో తొలుత ఉమెన్ నైట్ షెల్టర్ ఉండేది. సదరు భవనం శిథిలావస్థకు చేరడంతో నేలమట్టం చేసి అప్పటి నుంచి నైట్ షెల్టర్‌ను కమ్యూనిటీహాల్లోకి బదలాయించారు. పీఎస్ ఏర్పాటు కోసం నైట్ షెల్టర్‌ను


పీఎస్, ఏసీపీ కార్యాలయం ఏర్పాటు చేయనున్న బౌద్ధనగర్ కమ్యూనిటీహాల్ ఇదే..

వేరేచోటికి తరలించాలని పోలీసు అధికారులు కోరుతున్నారు.ఉమెన్ నైట్ షెల్టర్‌ను సీతాఫల్‌మండి డివిజన్ మేడిబావి కమ్యూనిటీహాల్‌లోకి మార్చాలనుకున్నారు. ఈలోపే అక్కడికి సీతాఫల్‌మండి ప్రభుత్వ జూనియర్ కళాశాల తరగతులు వచ్చి చేరాయి. కళాశాలకు కొత్త భవనాన్ని నిర్మిస్తున్న నేపథ్యంలో తరగతులను మేడిబావి కమ్యూనిటీహాల్లోకి బదలాయించారు. ఉమెన్ నైట్ షెల్టర్ కోసం అధికారులు వేరే ప్రాంతంలో భవనం ఇవ్వాలని నిర్వాహకులు కోరుతున్నారు. షెల్టర్ మారనిది పీఎస్ ఏర్పాట్లు జరిగే అవకాశం లేదు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉన్న బౌద్ధనగర్ డివిజన్ కార్పొరేటర్ కార్యాలయాన్ని కూడా త్వరగా ఖాళీ చేసే పరిస్థితులు లేవు. ఇది జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీహాల్ ఇక్కడ మేమే ఉంటాం అని కార్పొరేటర్ అనుచరులు భీష్మించి కూర్చున్నారు.

- ప్రస్తుతం అందుబాటులో ఉన్న రెండవ అంతస్తులో మాత్రం ఏసీపీ కార్యాలయాన్ని పోలీసు అధికారులు ఏర్పాటు చేసుకున్నారు. ఇక గ్రౌండ్, మొదటి అంతస్తులు తమ చేతిలోకి వస్తే వారాసీగూడ పీఎస్ ఏర్పాటు పనులు చేపట్టే అవకాశం ఉంది.

24 తర్వాత ఏర్పాట్లు..

పీఎస్, ఏసీపీ కార్యాలయం ఏర్పాటుకు ఉత్తర్వులు జారీ చేసిన నగర పోలీసు అధికారులు ఇప్పటి వరకు అధికారుల నియామకం, వసతుల ఏర్పాట్లు చేయలేదు. ఇన్‌స్పెక్టర్ ఇతర అధికారులు, సిబ్బంది కేటాయింపులు జరుగలేదు.అంబర్‌పేట్ ఏసీపీ శ్రీనివాస్‌రావును ఇన్‌చార్జి ఏసీపీగా తాత్కాలిక నియామకం చేశారు. ఈ నెల 24న ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగుస్తున్నందున ఆపై అధికారుల నియామకం, పీఎస్ ఏర్పాట్ల పనులు జరుగుతాయని అధికారులు చెబుతున్నారు.

ఎమ్మెల్యేతో సమావేశం...

సికింద్రాబాద్ ఎమ్మెల్యే, శాసనసభ డిప్యూటీ స్పీకర్ టీ.పద్మారావుగౌడ్‌తో పీఎస్ ఏర్పాటు గురించి పోలీసు అధికారులు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఇన్‌చార్జి ఏసీపీ శ్రీనివాస్‌రావు, చిలకలగూడ డీఐ నాగేశ్వర్‌రావు, ఎస్ఐ శ్రీనివాస్‌రావు, సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ పాల్గొన్నారు. బౌద్ధనగర్ కమ్యునిటీహాల్ గ్రౌండ్, రెండు అంతస్తులను మొత్తంగా తమకు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

రేవంత్‌ను రాళ్లతో కొట్టండి

- జీఆర్‌ఎస్వీ నాయకుల పిలుపు

ఉస్మానియా యూనివర్సిటీ: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని రాళ్లతో కొట్టండని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్, ఉపాధ్యక్షులు తుంగబాలు, గుండగాని కిరణ్‌గౌడ్ ఓయూ విద్యార్థి, నిరుద్యోగులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వరుస క్రమంలో భర్తీ చేస్తున్న తరుణంలో అనివార్య కారణాలతో పేపర్లు లీకైతే మంత్రి కేటీఆర్‌పై రేవంత్‌రెడ్డి నిందలు వేయడం దారుణమన్నారు. ఓటు కు నోటులో పట్టుబడి జైలుకు వెళ్లిన రేవంత్‌రెడ్డి నాటి నుంచి సీఎం కేసీఆర్ కుటుంబ సభ్యులపై పగతో కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. టీడీపీ నుంచి కాంగ్రెస్‌కు మారిన రేవంత్ తన వ్యక్తిగత పగను తీర్చుకునేందుకు వాడుకుంటున్నారు తప్ప ప్రజా సమస్యల కోసం పని చేయడం లేదన్నారు. నాడు తెలంగాణ ఉద్యమానికి దూరంగా ఉండి, నేడు నిరుద్యోగులకు ఎలాంటి సహాయం చేయాని రేవంత్‌రెడ్డి ఓయూకు వచ్చే నైతిక హక్కులేదన్నారు.

రేవంత్‌రెడ్డిని అడ్డుకుంటే సహించేది లేదు..

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ నిరసన దీక్షకు నేడు (24న) హాజరుకానున్న రేవంత్‌రెడ్డిని అడ్డుకుంటే సహించేది లేదని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు. ఉద్యోగాల భర్తీలో పేపర్ లీకేజీలు చేయించి కోట్లు ఆర్జిస్తూ నిరుద్యోగుల జీవితాలతో చలగాటమాడుతున్న బీఆర్‌ఎస్ మంత్రులు, టీఎస్‌పీఎస్సీ అధికారులపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. ఇదిలా ఉండగా నేడు, రేపు (24,25) ఆర్ట్స్ కాలేజీ వద్ద చేపట్టనున్న నిరసన దీక్షకు దరఖాస్తు చేసుకోగా అధికారులు అనుమతి ఇవ్వలేదని అయినా ఓయూలో దీక్షను జరిపి తీరుతామని ఓయూ విద్యార్థి జేఏసీ ఛైర్మన్ బైరు నాగరాజుగౌడ్ పేర్కొన్నారు.

ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికే ఎస్‌ఎన్‌డీపీ

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్


పనులపై అధికారులకు సూచనలు చేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

సనత్‌నగర్: ముంపు సమస్య నుంచి శాశ్వత విముక్తి కలిగించాలనే లక్ష్యంతో మంత్రి కేటీఆర్ చొరవతో సమగ్ర నాలా అభివృద్ధి కార్యక్రమం (ఎస్‌ఎన్‌డీపీ) చేపట్టినట్లు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ స్పష్టం చేశారు. బేగంపేట డివిజన్‌లో రూ.1.58 కోట్లతో పలు అభివృద్ధి పనులను గురువారం ఆయన ప్రారంభించారు. ముందుగా పీజీ రోడ్డులో రూ.19.50 లక్షలతో చేపట్టనున్న సీవరేజ్ పైప్‌లైన్ పనులను ప్రారంభించారు. అనంతరం పాటిగడ్డ ప్రభుత్వ పాఠశాల వద్ద రూ.23 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు, మోడల్ మార్కెట్ వద్ద రూ.6 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు పనులు, బ్రాహ్మణవాడీలో వివిధ ప్రాంతాల్లో రూ.1.10 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ఎమ్మెల్సీ వాణీదేవితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం బేగంపేట నాలాకు ఎగువ నుంచి వచ్చే వరదనీటితో నాలా వెంట ఉన్న కాలనీలు, బస్తీల్లో ఇళ్లు ముంపునకు గురై ప్రజలు అనేక అవస్థలు పడేవారని ఇక్కడి ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు రూ.45 కోట్లతో బేగంపేట నాలా అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. నాలా వెంట ఉన్న కాలనీల్లో నూతనంగా డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్ పనులు, రోడ్ల నిర్మాణ పనులు కూడా త్వరలో పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. బ్రాహ్మణవాడీలో కొన్ని ప్రాంతాల్లో రోడ్లు ఆక్రమణకు గురయ్యాయని స్థానికులు మంత్రి దృష్టికి తీసుకురాగా, ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మంత్రి వెంట కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరి, మాజీ కార్పొరేటర్ తరుణి, జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఎంసీ ముకుందరెడ్డి, వాటర్‌వర్క్స్ జీఎం రమణారెడ్డి, డీఈఈ సంతోష్ ఉన్నారు.

ప్రజలకు అండగా బీఆర్‌ఎస్..

రాంగోపాల్‌పేట: ప్రజలకు నిరంతరం అండగా ఉండేది కేవలం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని మంత్రి తలసాని అన్నారు. సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని రాంగోపాల్‌పేట డివిజన్ కళాసీగూడలో మాజీ కార్పొరేటర్ అరుణగౌడ్ అధ్యక్షతన జరిగిన పార్టీ డివిజన్ స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. దేశంలోనే అత్యధిక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే అన్నారు. 60-70 సంవత్సరాల నుంచి ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను కేసీఆర్ ప్రభుత్వంలోనే పరిష్కారం అయ్యాయన్నారు. ఇక్కడి ఓట్లతో ఎంపీగా గెలిచి కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి నాలుగేళ్లలో సికింద్రాబాద్ ప్రజలకు ఏం చేశారో చెప్పగలరా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో సాయికిరణ్‌యాదవ్, కార్పొరేటర్లు కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, మహేశ్వరిశ్రీహరి, హేమలత, నాయకులు తలసాని స్కైలాబ్‌యాదవ్, అత్తెలిశ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రాజెక్టు పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్


పనులపై చర్చిస్తున్న పద్మారావుగౌడ్

లాలాపేట: సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలో కొత్తగా చేపట్టిన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ ఆదేశించారు. తార్నాక డివిజన్ లాలాపేటలో రూ. 6 కోట్లతో నిర్మాణం చేస్తున్న స్విమ్మింగ్ పూల్, రూ. 6.99 కోట్లతో చేపట్టిన మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణాలను గురువారం ఆయన పరిశీలించారు. మే మాసంలోగా స్విమ్మింగ్ పూల్ పనులను పూర్తిచేసి, మూడు నెలల్లో ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులను పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట సునీల్ ముదిరాజ్, నాగేశ్వర్‌రావు, కూరెల్లి నాగరాజు గౌడ్, మల్లికార్జున్, లల్లు, రాజలింగం ఉన్నారు.

క్షయ నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న గాంధీ వైద్యులు

గాంధీఆస్పత్రి : భారతదేశం నుంచి టీబీ (క్షయ) వ్యాధిని తరిమికొట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజారావు పిలుపునిచ్చారు. ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం గాంధీ ప్రాంగణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. టీబీ వ్యాధిని నిర్మూలించడంలో విజయం సాధించే దిశగా దేశం అడుగులు వేస్తుందని, టీబీ నిర్మూలనే లక్ష్యంగా నిర్మాణాత్మకమైన కార్యాచరణ రూపొందించి అమలు చేస్తామన్నారు. క్షయవ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించి సరైన వైద్యం అందిస్తే నియంత్రణ సులభమన్నారు.ఈ కార్యక్రమంలో గాంధీ పల్మనాలజీ, ఆప్తమాలజీ హెచ్‌ఓడీలు కృష్ణమూర్తి, రవిశేఖర్, వైద్యులు రాములు, త్రిలోక్‌చందర్, సుచరిత, ఆర్‌ఎంఓ ప్రభుకిరణ్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక



రసూల్‌పురా: ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న అభివృద్ధి చూసి బీజేపీలో చేరుతున్నామని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి శాంసన్ రాజు అన్నారు. బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షులు శ్యాంసుందర్ గౌడ్ సమక్షంలో కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యులు జే. రామకృష్ణ నేతృత్వంలో గురువారం శాంసన్ రాజు, పద్మ దంపతులు తమ అనుచరులతో కలిసి బీజేపీలో చేరారు. అనంతరం శాంసన్ రాజు మాట్లాడుతూ.. కరోనా సమయంలో ప్రపంచ దేశాలు ఆర్థికంగా కుదేలైనా మన దేశం మోదీ సామర్థ్యంతో ఆర్థికంగా నిలదొక్కుకుందన్నారు. కంటోన్మెంట్‌లో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తా అన్నారు. ఈ కార్యక్రమంలో అమీర్‌పేట్ కార్పొరేటర్ సరళ, జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్, కంటోన్మెంట్ కన్వీనర్ డీబీ. విజయానంద్, జాయింట్ కన్వీనర్ సతీష్, శ్రీహరి, సత్యనారాయణ, నర్సింగ్, నరేష్, స్వామి పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషి చేయాలి



సనత్‌నగర్: భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా అమీర్‌పేటలోని ఆయన విగ్రహానికి బీఆర్‌ఎస్ నేతలు సరాఫ్ సంతోష్, సర్దార్ సురేందర్‌సింగ్ పూలమాలలు వేసి ఆయన చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. పిన్న వయస్సులోనే దేశం కోసం ప్రాణాలర్పించిన భగత్‌సింగ్ ఆశయాలను నెరవేర్చే దిశగా యువత ముందుకు సాగాలన్నారు.

హమాల్‌బస్తీలో..

పద్మారావునగర్: భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సందర్భంగా గురువారం బన్సీలాల్‌పేట్ డివిజన్ హమాల్‌బస్తీలో వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. నాయకులు సుభాష్, ఎం. యాదగిరి, రవి, కె. శ్యామ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు మాట్లాడారు. దేశం కోసం ప్రాణాలర్పించిన త్యాగధనుల చరిత్రలను చదివి ప్రతి ఒక్కరు సమాజహితం కోసం పని చేయాలని పిలుపునిచ్చారు. మహనీయుల ఆశయాలు ప్రస్తుత సమాజానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో సురేష్, వెంకట్, ధర్మరాజు, మోహన్, కుల్‌సుమ్, భాగ్య, రాందాస్ పాల్గొన్నారు.

తార్నాకలో..

లాలాపేట: విప్లవ వీరులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ అన్నారు. గురువారం తార్నాక కార్యదర్శి లతీఫ్ ఆధ్వర్యంలో తార్నాక చౌరస్తాలో నిర్వహించిన భగత్‌సింగ్ వర్ధంతిలో ఆయన పాల్గొని భగత్‌సింగ్ చిత్రపటం వద్ద కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉమర్‌ఖాన్, కొమరెల్లి బాబు, యూసుఫ్, రషీద్,యాదగిరి, ఖదీర్, నారాయణ, అంజి, హనుమంతు పాల్గొన్నారు.


నివాళి అర్పిస్తున్న సీపీఐ నేతలు


భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

క్రైం కార్నర్..

రైలు కిందపడి వ్యక్తి మృతి

సికింద్రాబాద్: రైలుకిందపడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. దయానంద్‌నగర్ రైల్వేస్టేషన్ సమీపంలో సుమారు 35 వయస్సు ఉన్న ఓ వ్యక్తి వేగంగా వస్తున్న అకోలా ఎక్స్‌ప్రెస్ రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు నల్లటి జీన్స్ ప్యాంటు, నలుపు తెలుపు గీతలు షర్టు ధరించి ఉన్నాడని ముస్లిం సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు.

జేమ్స్ స్ట్రీట్ వద్ద మరో వ్యక్తి..

సికింద్రాబాద్: జేమ్స్ స్ట్రీట్ రైల్వేస్టేషన్ సమీపంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సుమారు 40 ఏళ్ల వయస్సున్న ఓ వ్యక్తి సికింద్రాబాద్ నుంచి వికారాబాద్ వెళ్తున్న ఫలక్‌నుమా రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి ఒంటిపై తెల్ల చొక్కా ఉందని మృతదేహాన్ని మార్చురీకి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

శిశువిహార్‌లో 22 రోజుల పసికందు మృతి

సనత్‌నగర్: అప్పుడు పుట్టిన బిడ్డను ఓ మహిళ ఆస్పత్రిలో వదిలివెళ్లగా, శిశు విహార్ ఆశ్రయం పొందుతున్న ఆ పసికందు గురువారం కన్నుమూసింది. ఇన్‌స్పెక్టర్ సైదులు వివరాల ప్రకారం.. కోఠిలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో చౌటుప్పల్‌కు చెందిన ఉజాల అనే మహిళ ఈ నెల 1న ఆడ శిశువుకు జన్మనిచ్చింది. కాసేపటి తర్వాత ఈ శిశువును ఆస్పత్రిలోనే వదిలి వెళ్లిపోయింది. సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో చైల్డ్‌లైన్ అధికారులు వచ్చి ఈ నెల 4న యూసుఫ్‌గూడ స్టేట్ హోంలోని శిశు విహార్‌లో చేర్పించారు. అక్కడి సిబ్బంది సంరక్షణలో ఉన్న శిశువుకు వారు జననీ అని పేరు పెట్టారు. ఇదిలా ఉండగా పుట్టిన బిడ్డకు అప్పటికే కామెర్లు సోకడంతో అదే రోజు చికిత్స నిమిత్తం నీలోఫర్ ఆస్పత్రిలో చేర్చారు. చికిత్స అనంతరం 6న డిశ్చార్జి చేసిన శిశు విహార్‌కు తీసుకువచ్చారు. మళ్లీ అస్వస్థతకు గురికావడంతో బుధవారం నీలోఫర్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు శిశువిహార్ ఇన్‌ఛార్జి సంతోషిబాయి పేర్కొన్నారు.

మారణాయుధాలతో సంచరిస్తున్న ఇద్దరికి జైలు


మహ్మద్‌అద్నాన్, షేక్ ఆషు

చిలకలగూడ: మారణాయుధాలతో తిరుగుతన్న ఇరువురు పాత నేరస్తులకు రెండు నెలల జైలు శిక్ష విధించిన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ నరేష్, డీఐ నాగేశ్వరరావు, డీఎస్ఐ సాయికృష్ణ వివరాల ప్రకారం.. భవానీనగర్‌కు చెందిన మహ్మద్‌అద్నాన్ (19), బౌద్ధనగర్‌కు చెందిన షేక్‌ఆషు (19) వివిధ స్టేషన్లలో దొంగతనం కేసుల్లో నిందితులు. పార్శిగుట్ట చౌరస్తాలో బుధవారం అర్ధరాత్రి అనుమానాస్పదంగా సంచరిస్తుండగా అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా పొంతనలేని సమాధానాలు చెప్పారు. తనిఖీ చేయగా ఇరువురి వద్ద కత్తి, ఇనుపరాడ్లు లభించాయి. కేసులు నమోదు చేసి సికింద్రాబాద్ 15వ మెట్రోపాలిటన్ కోర్టులో గురువారం హాజరుపర్చగా ఒక్కొక్కరికి 60 రోజుల జైలుశిక్ష, రూ.50 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

కాలనీ ముఖద్వారం ప్రారంభం


భూమి పూజలో పాల్గొన్న ఎస్. శ్రీగణేశ్

కంటోన్మెంట్: జూబ్లీ బస్‌స్టేషన్ ఆవరణలో గుడెసెలతో మొదలైన ఆ బస్తీ ప్రస్థానం ప్రస్తుతం ఓ కాలనీగా రూపాంతరం చెందింది. గాంధీ హట్స్ పేరిట ఆర్టీసీ స్థలంలో గుడిసెలు వేసుకున్న ఆ బస్తీలోని వారికి ప్రభుత్వం వాంబే జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం, ఐజీ పథకాల కింద విడతల వారీగా పక్కా ఇళ్లు నిర్మించి ఇచ్చింది. మొత్తం 375 నివాసాలతో కూడిన గృహ సముదాయానికి గాంధీ కాలనీగా నామకరణం చేసుకున్నారు. సమష్టి కృషితో ఆ కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటితో పాటు వీధి దీపాలు సహా అన్ని మౌలిక సదుపాయాలు సమకూర్చుకున్నారు. ఇటీవలే దివంగత ఎమ్మెల్యే సహకారంతో కాలనీలో రూ.30 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం జరిగింది. రూ.20 లక్షల ఎమ్మెల్యే నిధులతో కాలనీలోని యువత కోసం ప్రత్యేక జిమ్ కూడా త్వరలోనే అందుబాటులోకి రానుంది. తాజాగా కాలనీకి ప్రత్యేక ముఖద్వారం ఏర్పాటు చేయనున్నారు. గురువారం ఎమ్మెల్యే సాయన్న కుమార్తెలు లాస్య నందిత, నివేదిత, బీఆర్‌ఎస్ సీనియర్ నేత ఎస్. శ్రీగణేష్‌లు వేర్వేరుగా హాజరై కాలనీ ముఖ ద్వారానికి నిర్వహించిన భూమి పూజలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంతోష్, నళినికిరణ్, టీఎస్ శ్రీనివాస్, రాజేంద్ర, ఇస్మాయిల్, ప్రభాకర్, సాయి కుమార్ పాల్గొన్నారు.

పాఠశాల భవనం కూల్చివేత

విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆందోళన



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ రోహిణి

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనం కూల్చివేత పనులు విద్యార్థుల ఆందోళనకు దారి తీశాయి. సీతాఫల్‌మండి ప్రభుత్వ ఉన్నతపాఠశాల భవన సముదాయంలో పాఠశాల, జూనియర్, డిగ్రీ కళాశాలల తరగతులు కొనసాగుతున్నాయి. ఇక్కడ రూ.29.75 కోట్ల వ్యయంతో భారీ విద్యా సంస్థల నిర్మాణం కోసం శాసనసభ డిప్యూటీ స్పీకర్ టీ.పద్మారావుగౌడ్ నిధులు మంజూరు చేయించారు. త్వరలో పనులు ప్రారంభించాల్సి ఉన్నందున డిగ్రీ కళాశాల తరగతులను విద్యానగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలోకి, జూనియర్ కళాశాల తరగతులను మేడిబావి కమ్యూనిటీహాల్ లోకి మార్చారు. ఇక మిగిలిన ఉన్నత పాఠశాల తరగతులను ఓయూ మోడల్ స్కూలు భవనంలోకి బదలాయించేందుకు కసరత్తు జరుగుతుంది. ఈ లోపు జూనియర్, డిగ్రీ కళాశాల భవనాలను నేలమట్టం చేసిన నిర్మాణదారుడు ఉగాది సెలవుదినం రోజున పాఠశాల భవనం కూల్చివేత పనులను ప్రారంభించడంతో మరోసటి రోజు పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి, సహాయక విద్యాశాఖ అధికారి చిరంజీవి పాఠశాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. ఇదిలా ఉండగా పాఠశాల తరగతుల నిర్వహణను సమీపంలోని ఓయూ మోడల్ స్కూల్‌కు మార్చే ప్రక్రియ జరుగుతుందని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ కార్యాలయ అధికారులు తెలిపారు. పండగ సెలవులు, ఎన్నికల కోడ్ కారణంగా ఓయూ అధికారులు అనుమతి పత్రాలు జారీ చేయడంలో జాప్యం జరిగిందని తెలిపారు. నిర్మాణం పనులను త్వరగా ప్రారంభించాల్సి ఉన్నందున కూల్చివేతల పనులు వేగంగా చేపట్టాల్సి వచ్చిందని రెండ్రోజుల్లో విద్యార్థుల ఇబ్బందులకు తొలగిస్తామన్నారు.

చెక్కు అందజేత

కంటోన్మెంట్: నిరుపేదల వైద్యానికి సీఎంఆర్‌ఎఫ్ ఎంతో దోహదపడుతుందని బీఆర్‌ఎస్ నేత పెద్దాల నర్సింహ అన్నారు. నాలుగో వార్డు గాంధీ కాలనీకి చెందిన రాజయ్యకు మంజూరైన రూ.55 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును గురువారం పెద్దాల నర్సింహ అందజేశారు.

హక్కుల సాధనకు పోరాడాలి


మాట్లాడుతున్న శంకర్ రావు

అడ్డగుట్ట: హక్కుల సాధనకై పోరాటాలకు యువత సిద్ధం కావాలని మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీ శంకర్‌రావు పిలుపునిచ్చారు. గురువారం సికింద్రాబాద్ మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. భగత్ సింగ్ పోరాట పటిమను యువత స్ఫూర్తిగా తీసుకుని హక్కుల సాధన కోసం పోరాటాలు చేయాలన్నారు. రవీందర్, ఫరూక్, రవిచంద్ర, చిలుక స్వామి, యుగేందర్, కుమారస్వామి పాల్గొన్నారు.